ఈనాడు
మంచిర్యాల
మంగళవారం అక్టోబరు 15, 2024

నిర్మించి రెండేళ్లు
ప్రారంభానికి ఎన్నేళ్లో!


నస్పూర్‌లోని ప్రారంభానికి నోచుకోని ఆరోగ్య యోగా (స్వస్థత) కేంద్రం

ప్రస్తుత సమాజంలో మనిషి ఉదయం లేచింది మొదలు రాత్రి పడుకునే వరకు తీరిక లేకుండా గడుపుతున్నాడు. శారీరక శ్రమ లేకపోవడంతో అనారోగ్యం పాలవడం, మధుమేహం, రక్త పోటు తదితర సమస్యలతో బాధపడుతున్నాడు. గర్భిణులు సైతం నిర్ణీత వ్యాయామం లేకపోగా సాధారణ కాన్పులు కష్టంగా మారి ఆపరేషన్లు చేయాల్సిన పరిస్థితులు తలెత్తుతున్నాయి. వీటన్నింటినీ యోగా, ధ్యానంతో దూరం చేయవచ్చని నేషనల్ ఆయుష్ మిషన్ ద్వారా జిల్లాలో 10 ఆరోగ్య యోగా (స్వస్థత) కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రతి యోగా కేంద్రానికి రూ.6 లక్షల చొప్పున నిర్మించి రెండేళ్లు పూర్తైనా ప్రారంభానికి నోచుకోవడం లేదు. లక్షల రూపాయలు వెచ్చించి చేపట్టిన నిర్మాణాలు వృథాగా ఉన్నాయి. అధికారులు స్పందించి శిక్షకులను నియమిస్తే ఆరోగ్య యోగా కేంద్రం ఉపయోగంలోకి వస్తుందని స్థానికులు పేర్కొన్నారు. దీనిపై జిల్లా ఆయుష్ ఇన్‌ఛార్జి డా.పద్మజను న్యూస్‌టుడే వివరణ కోరగా ఇటీవల శిక్షకుల నియామకాలు పూర్తి అయ్యాయని పేర్కొన్నారు. **- న్యూస్‌టుడే, నస్పూర్**

అంత్యక్రియల్లో తేనెటీగల దాడి

బెల్లంపల్లి పట్టణం, న్యూస్‌టుడే : పట్టణంలోని పోచమ్మ చెరువు వద్ద సోమవారం ఓ వ్యక్తి చనిపోవడంతో స్థానికులు, బంధువులు అంత్యక్రియల కోసం మృతదేహాన్ని తీసుకొచ్చారు. ఇదే సమయంలో చెట్టుకు ఉన్న తేనెటీగలు దాడి చేయడంతో వారంతా పరుగులు తీశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పక్కనే ఉండటంతో గాయపడిన 15 మంది అక్కడకు వెళ్లి చికిత్స తీసుకున్నారు. అనంతరం మళ్లీ అంత్యక్రియలు నిర్వహించారు.

జిల్లా వైద్యుడికి గ్లోబల్ హెల్త్‌కేర్ ఎక్స్‌లెన్స్ అవార్డు


సునీల్ గవాస్కర్ చేతులమీదుగా పురస్కారం స్వీకరిస్తున్న డా.ఎగ్గెన శ్రీనివాస్

మంచిర్యాల వైద్యవిభాగం, న్యూస్‌టుడే : జిల్లా కేంద్రానికి చెందిన కీళ్లు, ఎముకల వైద్యుడు, తెలంగాణ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు ఎగ్గెన శ్రీనివాస్‌కు 2024 సంవత్సరానికి గాను గ్లోబల్ హెల్త్‌కేర్ ఎక్స్‌లెన్స్ అవార్డు లభించింది. ఆర్థో విభాగంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అందించిన సేవలు, ప్రస్తుతం చేస్తున్న శస్త్ర చికిత్సలకు ఈ పురస్కారం అందించినట్లు ఆయన తెలిపారు. అంతర్జాతీయ మాజీ క్రికెట్ క్రీడాకారుడు సునీల్ గవాస్కర్ చేతులమీదుగా ఆదివారం హైదరాబాద్‌లో అవార్డు స్వీకరించినట్లు పేర్కొన్నారు.

16 నుంచి జాతీయ స్థాయి మానిటరింగ్ అధికారుల పర్యటన

హాజీపూర్, న్యూస్‌టుడే : హాజీపూర్ మండలంలోని 17 పంచాయతీల్లో కేంద్ర ప్రభుత్వం ద్వారా అందిస్తున్న సంక్షేమ పథకాలు, ఉపాధిహామీ పనులు, వాటర్‌షెడ్ల నిర్వహణ, ఇతర అంశాలపై జాతీయ స్థాయి మానిటరింగ్ అధికారుల బృందం ఈ నెల 16, 17వ తేదీల్లో క్షేత్ర స్థాయిలో పర్యటించనున్నట్లు ఏపీవో మల్లయ్య తెలిపారు. ఇందులో భాగంగా 16న వేంపల్లి, పెద్దంపేట, 17న బుద్ధిపల్లి గ్రామాల్లో పర్యటించి పనులను పరిశీలించనున్నట్లు ఆయన తెలిపారు.

నేడు ఉపాధ్యాయుల పోస్టింగ్‌లకు కౌన్సెలింగ్

మంచిర్యాల విద్యావిభాగం, న్యూస్‌టుడే : జిల్లాలో డీఎస్సీ 2024లో ఎంపికై నియామక ఉత్తర్వులు అందుకున్న నూతన ఉపాధ్యాయులకు పోస్టింగ్‌లకు సంబంధించి ఈ నెల 15న కౌన్సెలింగ్ ప్రక్రియను నిర్వహించనున్నట్లు డీఈవో యాదయ్య సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంబంధిత ఉపాధ్యాయులు మంగళవారం ఉదయం 10 గంటలకు నస్పూర్‌లోని కలెక్టరేట్‌లోని విద్యాశాఖ కార్యాలయంలో హాజరుకావాలని తెలిపారు.


అపోహలు వీడేలా.. చెల్లుబాటయ్యేలా

- పది నాణెంపై బ్యాంకు సిబ్బంది ప్రచారం

న్యూస్‌టుడే, లక్సెట్టిపేట

పది రూపాయల నాణెం చెల్లుబాటుపై ప్రజల్లో ఉన్న అపోహను తొలగించి వాటిని అన్ని వర్గాలతో వాడకంలోకి తెచ్చేందుకు రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రయత్నాలు ముమ్మరం చేసింది. అటు దుకాణ దారులు, ఇటు వినియోగదారులకు నమ్మకాన్ని కలిగించి వాటి చలామణి పెంచేందుకు వీలుగా ప్రచారాన్ని ప్రారంభించింది. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సహకారంతో నాణేల చట్టబద్ధతపై విస్తృత ప్రచారానికి శ్రీకారం చుట్టింది.


లక్సెట్టిపేటలో దుకాణదారులకు పది రూపాయల నాణేలు అందజేస్తున్న బ్యాంకు సిబ్బంది.



చిల్లర డబ్బుల కొరత

చిల్లర డబ్బుల చలామణి మామూలుగా కూరగాయల మార్కెట్లు, చిరు వ్యాపారులు, పాన్ దుకాణాలు, చిన్న చిన్న హోటళ్లు, కిరాణా దుకాణాల్లో ఎక్కువగా సాగుతాయి. పది రూపాయల నాణేలు చెల్లుబాటు కావన్న అపోహ ప్రజల్లో బలంగా నాటుకుపోయిన కారణంగా అక్కడ కూడా తీసుకోవడానికి నిరాకరిస్తున్నారు. తప్పని పరిస్థితుల్లో చిరిగిన, నలిగిపోయిన నోట్లు తీసుకుంటున్నారు తప్ప వీటిని తీసుకోవడానికి వెనకడుగు వేస్తున్నారు. దీంతో మార్కెట్లో చిల్లర డబ్బుల కొరత తీవ్రంగా మారింది.

ఇదీ సమస్య

రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా పది రూపాయల నాణేలను 2005లో తొలిసారిగా ముద్రించింది. 2019 వరకు ఆయా సందర్భాలను బట్టి 14 సార్లు ఇవి విడుదలయ్యాయి. అన్ని రకాల నాణేలు చెల్లుబాటులో అవుతాయని రిజర్వు బ్యాంకు పలుమార్లు స్పష్టం చేసినా వాటి చలామణి దాదాపు నిలిచిపోయింది. అవగాహన ఉన్న కొందరు వాటిని వాడుదామనుకున్నా ఎదుటి వ్యక్తులు వాటిని తీసుకోవడానికి నిరాకరించడంతో బహిరంగ మార్కెట్‌లో వాడకం నిలిచిపోయింది. పది రూపాయల నోట్లు మార్కెట్లో ఉన్నప్పటికీ చేతులు మారేకొద్దీ అవి చినిగి పనికి రాకుండా పోతాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని రిజర్వు బ్యాంకు పది రూపాయల నాణేలు ముద్రిస్తున్నా వాటి చలామణి నిలిచిపోవడం సమస్యగా మారింది.

ఏం చేస్తున్నారంటే...

బ్యాంకు పరిధిలోని మార్కెట్లు, దుకాణాలు, రైతు బజార్‌లు, ప్రధాన మంత్రి స్వనిధి లబ్ధిదారులను కలిసి వారికి పది రూపాయల నాణెం చలామణికి సంబంధించి చట్టబద్ధతపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ నెల 15వ తేదీన కూడా విస్తృతంగా ప్రచారం నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా బ్యాంకు సిబ్బంది తమ కరెన్సీ చెస్ట్ నుంచి కనీసం పది నాణేలు తీసుకుని వాటిని అన్ని వర్గాలకు పంపిణీ చేసి చలామణిలోకి తీసుకొచ్చేలా ప్రచారం చేస్తున్నారు. తర్వాత రోజుల్లో బ్యాంకు సిబ్బంది లావాదేవీల సందర్భంగా ప్రతి వినియోగదారుడికి నగదు చెల్లింపుల సందర్భంగా నిర్ణీత మొత్తంలో నాణేలు అందజేయనున్నారు. దీంతో మార్కెట్‌లో చిల్లర సమస్య తొలగనుంది.

తీసుకోవడానికి నిరాకరిస్తే చర్యలు

పది రూపాయల నాణేలు చెల్లుబాటు కావనేది అపోహ మాత్రమే. గతంలో పలుమార్లు రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా నాణేల చట్టబద్ధతపై స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. ఎవరైనా పది రూపాయల నాణేలు తీసుకోవడానికి నిరాకరిస్తే చట్టప్రకారం చర్యలు తప్పవు.

- బిశ్వనాథ్ బోయ్, బ్రాంచి మేనేజర్, యూనియన్ బ్యాంకు, లక్సెట్టిపేట

తుదిదశకు ఇందిరమ్మ కమిటీల ఎంపిక

మంచిర్యాల పట్టణం, హాజీపూర్, న్యూస్‌టుడే

జిల్లాలో నిరుపేదలకు గూడు కల్పించడానికి ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు ప్రభుత్వం పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఇందిరమ్మ కమిటీల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ఈ నెల 14న కమిటీల ఎంపిక ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉండగా బతుకమ్మ, విజయదశమి పండగల కారణంగా కొంత జాప్యం ఏర్పడింది. పట్టణాల్లో పురపాలక సంఘాల కమిషనర్లు, గ్రామాల్లో ఎంపీడీవోలు కమిటీల ఎంపిక ప్రక్రియ చేపట్టారు. తుది నివేదికను జిల్లా కలెక్టర్ కుమార్‌దీపక్‌కు అందజేయాల్సి ఉంది.



జిల్లాలోని పురపాలికలు, పంచాయతీల వివరాలివే..

పనివిధానం ఇలా..

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన అంశాలపై ఎంపికైన కమిటీలు లబ్ధిదారులకు అవగాహన కల్పించడంతో పాటు, అర్హులైన లబ్ధిదారులను గుర్తించి జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక అందించనున్నారు. ఎంపికైన కమిటీలు పురపాలికలు, పల్లెల్లో సామాజిక తనిఖీ బృందాలుగా పనిచేస్తూ ఉన్నతాధికారులకు సంధానకర్తలుగా ఉండనున్నాయి.

- మంచిర్యాల, క్యాతనపల్లి పురపాలికల్లో కమిటీల ఎంపిక ప్రక్రియ పూర్తయింది. మరిన్ని పురపాలికల్లో ఎంపిక చేయాల్సి ఉంది. మంచిర్యాల, చెన్నూరు, బెల్లంపల్లి నియోజకవర్గాల్లోని గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల కమిటీల ఎంపిక పనులు కొనసాగుతున్నాయి.

పారదర్శకంగా ఎంపిక

ఇందిరమ్మ ఇళ్ల కమిటీల ఎంపిక ప్రక్రియను ఆయా పురపాలక సంఘాల కమిషనర్లు, మండలాల ఎంపీడీవోలు పారదర్శకత పాటించి రాజకీయాలకతీతంగా సభ్యులను ఎంపిక చేయాలని ప్రజలు కోరుతున్నారు. అధికార పార్టీ సభ్యులకే ప్రాధాన్యమిస్తున్నట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. పార్టీలకతీతంగా విద్యావంతులు, సామాజిక కార్యకర్తలను కమిటీల్లో చేర్చి అర్హులైన నిరుపేదలకు ఇళ్లను అందించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పీసా చట్టానికి విరుద్ధంగా నియామకం

కాసిపేట: ప్రభుత్వం ఇందిరమ్మ కమిటీలను ఏజెన్సీలో పీసా చట్టానికి విరుద్ధంగా నియమిస్తున్నాయని ఆదివాసీ సేన మండల అధ్యక్షుడు మడావి వెంకటేష్ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. వాటిని వెంటనే విరమించుకోవాలని కోరారు.

విలువైన భవనాలు.. ఆలోచిస్తే ప్రయోజనాలు

మంచిర్యాల సిటీ, న్యూస్‌టుడే

ప్రస్తుతం జిల్లా కేంద్రంలో సమీకృత మార్కెట్ సముదాయ భవనం కూల్చివేతలపైనే అందరూ మాట్లాడుకుంటున్నారు. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పేరిట ఈ కార్యక్రమం చేపట్టగా దీనిపై మిశ్రమ స్పందన వస్తోంది. ఇందులో ఉన్న భవనాలు కూల్చివేస్తామని ఇటీవల ఓ ప్రజాప్రతినిధి పలుమార్లు సమావేశాల్లో వెల్లడించారు. ఆసుపత్రి కోసమంటూ రూ.కోట్లు విలువ చేసే భవనాలకు కూల్చి వేయడం ఎందుకనే అభిప్రాయాలు స్థానికుల నుంచి వ్యక్తం అవుతున్నాయి. ప్రత్యామ్నాయాలు ఆలోచిస్తే విలువైన భవనాలను వినియోగించుకోవచ్చని పేర్కొంటున్నారు.


ఇది రహదారులు, భవనాల శాఖకు సంబంధించి నూతనంగా నిర్మించిన అతిథి గృహం. 2019లో రూ. 2.20 కోట్ల అంచనా వ్యయంతో పనులు ప్రారంభించారు. అనంతరం అంచనా వ్యయం రూ.3 కోట్లకు పెరిగింది. 2023లో భవన నిర్మాణం పూర్తయింది. కానీ అధికారికంగా ప్రారంభించలేదు. జిల్లాకు ఎస్ఈ కార్యాలయం మంజూరు కావడంతో ప్రస్తుతం తాత్కాలికంగా ఇక్కడ కార్యకలాపాలు సాగిస్తున్నారు. దీన్ని కూల్చివేసేందుకు ఇలా కవర్లు కప్పినట్లు సమాచారం.


పదేళ్ల కిందటే రోడ్లు, భవనాల శాఖ ఈఈ కార్యాలయం కోసం నిర్మించిన భవనంలో ఆర్డీఓ కార్యాలయాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్రస్తుతం ఆర్డీవో కార్యాలయాన్ని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి తరలించారు.
- రోడ్లు, భవనాల శాఖకు సంబంధించిన ఈఈ క్వార్టర్‌పై కొంతకాలం కిందటే నూతనంగా మరో స్లాబు వేశారు. ఆర్అండ్‌బీ డీఈ స్థాయి అధికారుల కోసం నిర్మించిన క్వార్టర్లలో ప్రస్తుతం ఈ శాఖకు చెందిన పలు విభాగాలు ఇక్కడ కొనసాగుతున్నాయి. వీటిని కూల్చివేయనున్నట్లు తెలిసింది.

జిల్లా కేంద్రంలోని ఐబీలో ప్రస్తుతం నాలుగున్నర ఎకరాలకు పైగా స్థలం ఉండగా నిర్మాణం చేపట్టే సూపర్‌స్పెషాలిటీకి ఇది పూర్తిగా అవసరమని నిర్ధారించారు. 650 పడకలతో ఆసుపత్రి భవనాల నమూనాలు సిద్ధం చేయించారు. భవిష్యత్తులో 1200 పడకలకు ఉపయోగపడేలా నిర్మాణం చేపడుతున్నట్లు ఎమ్మెల్యే చెబుతున్నారు. 20 గుంటల్లో పురపాలిక మంచినీటి ట్యాంకు ఉండటంతో దీన్ని మినహాయించి భవన నిర్మాణం చేపట్టనున్నారు. సూపర్‌స్పెషాలిటీ, ఎంసీహెచ్(మాతా, శిశు ఆరోగ్య కేంద్రం)భవనాలు రెండు బ్లాకులుగా విభజించి నిర్మాణం చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. అంచనా వ్యయాన్ని పన్నులతో సహా రూ.324 కోట్లుగా నిర్ణయించారు. నవంబరులో శంకుస్థాపనకు సన్నాహాలు చేస్తున్నారు. మొన్నటి వరకు సమీకృత మార్కెట్ సముదాయ భవనాన్ని కూల్చివేయగా ఇప్పుడు ఆర్అండ్‌బీ భవనాలను కూల్చివేసేందుకు ఏర్పాటు చేస్తున్నారు. రోడ్లు, భవనాల శాఖకు పాలనాధికారి కార్యాలయ సమీపంలో స్థలం కేటాయించి భవనాల కోసం సుమారు రూ.6 కోట్లు మంజూరు చేయించనున్నట్లు సమాచారం.
- జిల్లా కేంద్రంలో సూపర్‌స్పెషాలిటీ సేవలతో పాటు ట్రామాకేర్ సెంటర్ అత్యవసరం. ఇటీవల కూల్చివేత చేపట్టిన సమీకృత మార్కెట్ సముదాయ ప్రాంతం ఆసుపత్రి నిర్మాణానికి అనుకూలంగా మారనుంది. ఇప్పుడున్న ఏ ఒక్క భవనాన్ని కూల్చకుండా ఈ ప్రాంతాలకు అనుగుణంగా ఓ చోట ట్రామా, మరో చోట సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం చేపడితే ఎలాంటి నష్టం లేకుండా ఈ రెండు కేంద్రాలను అందుబాటులోకి తీసుకురావచ్చనే పట్టణవాసుల నుంచి అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి చర్యలు

ఏసీసీ, న్యూస్‌టుడే : జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. సోమవారం నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో సెంటర్ ఫర్ రూరల్ మేనేజ్‌మెంట్ నేషనల్ లెవెల్ మానిటరింగ్ సభ్యులు సి.వి బాలమురళి, కె. హెచ్ సునీల్‌తో కలిసి జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. 250 మంది కంటే ఎక్కువ జనాభా ఉన్న గ్రామాల నుంచి మండల కేంద్రానికి అనుసంధానమయ్యే రోడ్లు, మరమ్మతుల వివరాలతో నివేదికలు అందించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో చేపడుతున్న పనులను త్వరగా పూర్తిచేయాలన్నారు. ఈ నెల 15 నుంచి 19 వరకు నేషనల్ లెవల్ మానిటరింగ్ సభ్యులు ఎంపిక చేసిన 4 మండలాల్లోని 10 గ్రామాల్లో పర్యటించనున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల్లో కొనసాగుతున్న పనుల వివరాల నివేదికలు అందించాలని సూచించారు. జిల్లాలో వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న న్యూ ఇండియా లిటరసీ కార్యక్రమం సర్వేను అధికారులు పరిశీలిస్తారని తెలిపారు. గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి కిషన్, వయోజన విద్యాధికారి పురుషోత్తం నాయక్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి


బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

ఏసీసీ, న్యూస్‌టుడే : ప్రజావాణి ఫిర్యాదుల విభాగానికి వచ్చే దరఖాస్తులపై సంబంధిత శాఖలు తక్షణమే స్పందిస్తూ బాధితులకు భరోసా కల్పించాలని కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. సోమవారం నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో పలువురు అర్జీదారుల నుంచి ఫిర్యాదులను స్వీకరించి పరిష్కారానికి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఆయా శాఖలకు సంబంధించి వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పెండింగ్ లేకుండా పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్, బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ, జిల్లా శాఖల అధికారులు పాల్గొన్నారు.

వచ్చిన ఫిర్యాదులు ఇలా..

- నిరుపేద అయిన తనకు గృహ నిర్మాణానికి ప్రభుత్వ స్థలాన్ని కేటాయించి ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ జైపూర్ మండలం శివ్వారంకు చెందిన రాజశ్రీ అంజన్న కలెక్టర్‌ను కోరారు.
- తనకు కొంత స్థలం ఉందని ఇంటి నిర్మాణం కోసం ఆర్థిక సాయం అందించాలని కోరుతూ బెల్లంపల్లికి చెందిన మనీష్‌కుమార్ మిశ్రా దరఖాస్తు అందించారు.
- రహదారులకు అడ్డంగా ఉన్న అక్రమ నిర్మాణాలను తొలగించి ప్రజల ఇబ్బందులు లేకుండా చూడాలని బెల్లంపల్లికి చెందిన శ్రీనివాస్ ఫిర్యాదు చేశారు.
- తన భూమి వివరాలు పాసుపుస్తకంలో తక్కువ విస్తీర్ణంలో నమోదుకావడంతో పాటు భూమి ఇతరుల పేరిట తప్పుగా రికార్డు అయిందని దీన్ని సవరించాలని కోరుతూ దండేపల్లి మండలం మామిడిపల్లికి చెందిన ఎల్తపు శంకరయ్య కోరారు.
- పట్టాభూమికి ఎలాంటి నష్ట పరిహారం చెల్లించకుండా సింగరేణి సంస్థ ఆధీనంలోకి తీసుకుందని తనకు న్యాయం చేయాలని కోరుతూ జైపూర్ మండలం టేకుమట్లకు చెందిన గాడిపెల్లి సుధాకర్ ఫిర్యాదు చేశారు.

రైతేరాజు 6లో

ఇచ్చి ‘పుచ్చుకుంటున్నారు’

- సామాజిక తనిఖీల్లో వెలుగు చూడని అవినీతి తతంగం

ఈటీవీ ఆదిలాబాద్

ఉమ్మడి జిల్లాలో ఉపాధి హామీ పథకం అమలు గాడి తప్పుతోంది. అధికారుల పర్యవేక్షణలోపంతో పనుల నిర్వహణ అక్రమాలకు దారి తీస్తోంది. జిల్లాకు ప్రత్యేకంగా అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి(అడిషనల్ డీఆర్‌డీవో) ఉన్నప్పటికీ పనుల నిర్వహణలో పారదర్శకత కనిపించటం లేదు. పైగా కొంతమంది అధికారులు సామాజిక తనిఖీల్లో బయట పడకుండా ఇచ్చిపుచ్చుకునే ధోరణిలో వ్యవహరిస్తుండటంతో ఈ అవినీతి తతంగం వెలుగు చూడటం లేదు. ఫలితంగా క్షేత్ర స్థాయిలో జరిగే విషయాలు ఉన్నతాధికారుల దృష్టికి రావటం లేదు. కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది ఒక్కొక్కరికి రోజు కూలీ రూ.300 నిర్ణయించినప్పటికీ రూ. 250 దాటలేదు.




బేల మండలం ఇంద్రానగర్‌కు చెందిన ఇతడి పేరు సిరాజ్. వేసవిలో భార్యతోపాటు చేసిన కూలీ పనికి వచ్చిన రూ.12 వేల డబ్బులు అధికారులు చెల్లించటం లేదు. ఇతడిలా ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లోని పేదల గోడును అధికారులు పట్టించుకోవడం లేదు. అక్రమాలను సైతం పారదర్శకంగా ఉన్నట్లు నమ్మించటంలో సిద్ధహస్తులైన కొంత మంది అధికారులు, సిబ్బంది కారణంగా పనుల నిర్వహణ అంతా ఆగమాగంగా ఉంది. రోజు కూలీ రూ.300 దక్కేలా పనులు చూపించాల్సి ఉంది. నిర్మల్ జిల్లాలో సగటు కూలీ రూ.218, ఆదిలాబాద్ జిల్లాలో రూ.238కే పరిమితం చేయటం కూలీల పాలిట శాపంగా మారుతోంది.

- ఆదిలాబాద్ గ్రామీణ మండలం లోకారి, అంకోలి గ్రామాల శివారులో కాకుండా 5 కి.మీ దూరంలో పనులు చూపించిన విషయం జిల్లా అదనపు డీఆర్‌డీవో కుటుంబరావు దృష్టికి వచ్చినప్పటికీ పట్టించుకోలేదు. పని కావాలని మొరపెట్టుకున్నా.. కూలీల గోడు వినలేదు.

ఆదివాసీలకు అన్యాయం

ఆసిఫాబాద్ జిల్లాలో చోటు చేసుకున్న అక్రమాలు బయటకు పొక్కకుండా క్షేత్రస్థాయిలో సర్దుబాటు చేసే ప్రయత్నం జరుగుతున్నట్లు ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లింది. ఆదివాసీల అమాయకత్వాన్ని ఆసరా చేసుకొని కొంత మంది సిబ్బంది బినామీ వ్యక్తుల పేరిట లబ్ధి పొందే దందా సాగుతోంది. ఇటీవల ఆసిఫాబాద్ మండలంలో 27 పంచాయతీలు ఉంటే 19 పంచాయతీల పరిధిలోని పనుల్లో రూ.3,68,900 నిధులు దుర్వినియోగం అయినట్లు తేలింది. జిల్లాలోని 15 మండలాల్లోని 335 పంచాయతీల పరిధిలోని అక్రమాలను సర్దుబాటు చేసే ప్రయత్నం జరుగుతోంది. కూలీల్లో అత్యధికులు ఆదివాసీలే కావటంతో అధికారులు చెల్లించిందే వేతనం అన్నట్లు నమ్మించే ప్రయత్నం జరుగుతోంది.

మంచిర్యాలలో ఇలా..

మంచిర్యాల జిల్లాలో కూలీలకు పనులు చూపించడానికంటే నేతల సిఫారసులకే అధికారులు ప్రాధాన్యమిస్తున్నారనే ఆరోపణలు వినవస్తున్నాయి. సింగరేణి ప్రాంతమైనందున కూలీ పనులకు గ్రామీణులు ముందుకురారని నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు సైతం పట్టించుకోకపోవటం అధికారులకు కలిసి వస్తోంది. కోటపల్లి మండలంలోని 31 పంచాయతీల్లో రూ.5.01 కోట్ల పనులు జరిగితే రూ.4.84 కోట్ల చెల్లింపులు జరిగినట్లు తేలింది. మరో రూ.17,72,917 తేడాలున్నట్లు దృష్టికిరాగా రూ.26,116 రికవరీకి ఆదేశించారు. చెన్నూరు మండలంలోని 30 పంచాయతీల పరిధిలో దుర్వినియోగమైన రూ.51 వేలు రాబట్టినట్లు నివేదికలు తయారు చేయటం అధికారుల పనితనాన్ని వెల్లడిస్తోంది.

జిల్లాల వారీగా వివరాలు..

జిల్లా	మండలాలు	పంచాయతీలు
ఆదిలాబాద్	17	473
నిర్మల్	18	400
ఆసిఫాబాద్	15	335
మంచిర్యాల	16	311

అయిదేళ్ల బాలికపై అత్యాచారం

భీమారం, న్యూస్‌టుడే : ఇంటి ముందు ఆడుకుంటున్న అయిదేళ్ల అభం శుభం తెలియని పసిపాపపై తాత వయస్సున్న వ్యక్తి అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఈ అమానవీయ ఘటన జైపూర్ మండలంలోని ఓ గ్రామంలో ఆదివారం చోటు చేసుకోగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. జైపూర్ ఎస్సై శ్రీధర్ సోమవారం తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని ఇంటి సమీపంలో ఆడుకుంటున్న బాలికను అదే గ్రామంలో కూలీగా జీవనం సాగిస్తున్న సంక మల్లయ్య (50) అతని ఇంటిలోకి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. అనంతరం పాప ఏడుస్తూ ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులకు తెలిపింది. బాలికను ఆసుపత్రికి తరలించి పోలీసులకు సమాచారం అందించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదుతో సంక మల్లయ్యను అదుపులోకి తీసుకుని పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండుకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

సస్యరక్షణతోనే దిగుబడి..

మంచిర్యాల వ్యవసాయం, న్యూస్‌టుడే:

ప్రస్తుతం వరిలో కలుపు పనులు పూర్తయ్యాయి. ముందుగా నాటు వేసిన చోట గొలకలు వేస్తున్నాయి. కర్ర గట్టిపడుతోంది. ఈ సమయంలోనే పంటలు కాపాడుకోవడం ఎంతో కీలకం. పంటను ఏమాత్రం అశ్రద్ధ చేసినా దిగుబడి తగ్గే ప్రమాదముంది. అయితే పంట చేతికొచ్చే వేళ వాతావరణంలో వస్తున్న మార్పుల వల్ల చీడలు ఆశించే ప్రమాదముంది. చీడలను పసిగట్టి నివారణ చర్యలు వాడి... సస్యరక్షణ చర్యలు వాడితేనే దిగుబడి వస్తుందని బెల్లంపల్లి కేవీకే శాస్త్రవేత్త డా.శివకృష్ణ వెల్లడించారు.



సాగు చేస్తున్న వరి

వరిలో ఇలా..

కంకినల్లి: ఈ పురుగు ఆశిస్తే గొలక నల్లగా మారుతుంది. దీని నివారణకు వర్షం లేని సమయంలో ఎకరాకు ఒక మి.ల స్పైరోమెసిఫెన్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

కాండం తొలుచుపురుగు: ఈపురుగు సోకితే పిలకలు చనిపోయి తెల్లకంకులుగా మారతాయి. కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 2.0 గ్రాములు లేదా ఫాస్ఫమిడాన్ 2.0 మి.లీ లేదా అసిఫేటు 1.5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

అగ్గితెగులు: గాలిలో తేమ ఎక్కువగా ఉండటం వల్ల అగ్గితెగులు ఆశించే ప్రమాదం ఉంది.. దీని నివారణకు 0.6 గ్రా. ట్రైసైక్లోజోల్ లేదా 1.5 మి.లీఐసోప్రోథయోలేన్ లీటరు నీటికి కలిపి 10-15 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి.

దోమపోటు, సుడిదోమ: గోధుమ వర్ణపు దోమ, తెల్ల మచ్చ దోమ వరిపైరును ఆశించడం వల్ల కర్ర మొదళ్ల దగ్గర చేరి రసం పీలుస్తాయి. దీనివల్ల పైరు సుడులుసుడులుగా ఎండిపోతుంది. పొలంలో నుంచి నీటిని తీసివేసి 1.5ఎసిఫేటు 75 ఎస్‌పీ లీటరు నీటికి వరి పైరు మొదళ్లపై పడేట్లు పిచికారీ చేయాలి. ఉద్ధృతి ఎక్కువగా ఉంటే ఒక ఎకరానికి కార్బోఫ్యూరాన్ 10 జీ గుళికలు 10 కిలోలు లేదా బుప్రొఫెజిన్ 1.6 మి.లీ లీటరు నీటికి కలిపి మొదళ్ల దగ్గర తడిచేలా పిచికారీ చేయాలి.

ఆకుముడత: గొంగళి పురుగు ఆకులు రెండు అంచులు కలిపి లోపలి నుంచే కర్ర ఆకుపచ్చ పదార్థాన్ని తినివేయడం వల్ల ఆకులు ఎండిపోతాయి. దీని నివారణకు ఎసిఫేటు 1.5 గ్రాములు లేదా కార్బాఫ్ హైడ్రోక్లోరికామ్లం 2.0 గ్రాములు లేదా ప్రొఫెనోఫాస్ 2.0 మి.లీ లేదా మోనోక్రోటాపాస్ 1.6 మి.లీ ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

రైతేరాజు

పత్తిలో సస్యరక్షణ చర్యలు: పత్తి ప్రస్తుతం కాయగట్టి పడే దశలో ఉంది. ఈ దశలో సస్యరక్షణ చర్యలు ఇలా...

రసం పీల్చే పురుగు: ఈ పురుగు లార్వాలు మొగ్గలు, పువ్వులకు చిన్నరంధ్రాలు చేసి కర్రకు నష్టం చేకూరుస్తాయి. దీంతో మొగ్గలు, పువ్వులు రాలిపోతాయి. కాయలు, పిందెలను తింటూ నష్టం కలుగజేస్తాయి. నివారణకు ప్రొఫెనోఫాస్ 2 మి.లీ. లేదా థయోడికార్బ్ 1.5 గ్రాము లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. ఉద్ధృతి ఎక్కువగా ఉంటే ఇండాక్సాకార్బ్ 1మి.లీ లేదా స్పైనోశాడ్ 0.3 మి.లీ లేదా ఇమామెక్టిన్ బెంజోయేటు 0.5 గ్రాము లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

మచ్చల పురుగు: ఈ పురుగు లార్వాలు లేత కొమ్మలను కాయలను తొలచి నష్టం చేస్తాయి. ఇవి ఆశిస్తే కొమ్మ ఎండిపోయి, కాయలు రాలిపోతాయి. పురుగు ఆశించిన భాగాల్లో దీని విసర్జన పదార్థం కన్పిస్తుంది. దీని నివారణకు క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ లేదా థయోడికార్బ్ 1.5 గ్రా.లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

పది పంటలు.. ప్రతి రోజు ఆదాయం

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ వ్యవసాయం : పట్టణానికి దగ్గరలో ఉన్న పల్లె రైతులు రోజు వారీ ఆదాయం వచ్చే పంటలపై దృష్టి సారించారు. ఒకటి, రెండు పంటలతో సరిపెట్టుకోకుండా.. కూరగాయలు, పూలు తదితర పంటలు సాగు చేస్తూ ఆదాయం గడిస్తున్నారు. ఇలాంటి రైతుల్లో తాంసి మండలం వడ్డాడికి చెందిన పొచ్చన్న ఒకరు. వడ్డాడిలో కొంత భూమి ఉన్నా. రోడ్డు పక్కన పట్టణానికి దగ్గరలో ఉండే పొన్నారిలో ఎకరం భూమి కౌలుకు తీసుకున్నారు. టమాటా, వంకాయ, బెండ, అలచెంత, బబ్బెర, బీరకాయ కూరగాయలతో పాటు ఆకుకూరలు సాగు చేసి ఎప్పటికప్పుడు మార్కెట్‌కు తరలించేలా ఏర్పాట్లు చేసుకున్నారు.



పండించిన పంటతో రైతు పొచ్చన్న, వడ్డాడి, తాంసి

ఆదర్శం

జిల్లా కేంద్రానికి గ్రామం దగ్గరలో ఉండటం.. రోజు పండించిన పంట ఉత్పత్తులను మార్కెట్‌కు తరలించడం సులువుగా ఉండటంతో కూరగాయలను సాగు చేసి రోజు ఆదాయం పొందవచ్చని భావించారు. సొంత భూమిలో పత్తి, సోయా సాగు చేసి, కౌలుకు తీసుకున్న భూమిలో ఒక పంట చేతికి రాగానే మరో పంట చేతికి వచ్చేలా కూరగాయలు సాగు చేశారు. ఎక్కువ దిగుబడి వస్తే టోకుగా విక్రయిస్తారు. పది రకాల పంటలు సాగుకు మొత్తంగా ఏడాదిలో రూ.5 లక్షల పెట్టుబడి కాగా, ఖర్చులు పోనూ ఎకరానికి రూ.2 లక్షల చొప్పున 6 లక్షల ఆదాయం పొందే అవకాశం ఉందన్నారు. ఈ సీజన్‌లో మొన్నటి వరకు టమాటా ధర తక్కువగా ఉండేది.

ఇప్పుడు ఏకంగా కిలో రూ.80కి పైగా ఉంది. పూలు కిలో రూ.80 నుంచి రూ.100 వరకు ధర ఉంది. పలు రకాల పంటల సాగుతో ఒక రకానికి ధర తగ్గినా.. మరో పంటతో ఆదాయం పొందే అవకాశం ఉంటుందని వివరించారు.

రైతు ప్రశ్న – శాస్త్రవేత్త సమాధానం



రాజశేఖర్, కీటక శాస్త్రవేత్త కృషి విజ్ఞాన కేంద్రం, ఆదిలాబాద్
ఫోన్ నెంబరు: 99085 56659

ప్రశ్న : పత్తి పూత దశలో ఉంది. ప్రస్తుత పరిస్థితుల్లో పంటను ఆశించే పురుగులను నివారించడం ఎలా?
- రాకేశ్, జైనథ్

జవాబు : 5 మి.లీ వేప నూనె(1500 పీపీఎం) లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.


ప్రశ్న : కంది పంటలో మొక్క ఎదగాలంటే ఏం చేయాలి?
- ఆశన్న, బెల్లూరి

పాల దిగుబడి ఇలా...

మీకు తెలుసా?

ప్రస్తుతం గేదెలు ఎక్కువగా ఈనుతుంటాయి. చూడి గేదెలను సంరక్షణలో జాగ్రత్తలు తీసుకుంటేనే పాల దిగుబడి బాగా వస్తుందని పశువైద్యాధికారి ధన్‌రాజ్ వివరించారు. పచ్చిగడ్డితో బదులు నేపియర్, జొన్న కర్రలు, లవణాలు, సమీకృత దాణా అందజేయాలి. గడ్డి, జొన్న, నేపియర్ విత్తనాలు రాయితీపై పశువుల ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్నాయి. పాల దిగుబడి కోసం గేదెలకు కాల్షియం బోరో గ్లూకోజ్ ఇంజక్షన్లు వేయించాలి. ముందస్తుగా టీకాలు వేయించి దోమలు లేకుండా చూడాలి. **- న్యూస్‌టుడే, దండేపల్లి**

సార్వత్రిక చదువు.. భవితకు వెలుగు



చెన్నూరు, న్యూస్‌టుడే:

చదువుకోవాలని కొందరికి ఆసక్తి ఉంటుంది. కానీ వివిధ కారణాలు, కుటుంబ ఆర్థిక పరిస్థితులతో పాఠశాల స్థాయిలోనే మధ్యలో ఆపేస్తుంటారు. ఇంకొందరు పదోతరగతి పూర్తయిన తర్వాత ఇంటర్ విద్యకు వెళ్లకుండా మానేస్తుంటారు. మళ్లీ చదువుకోవాలనే ఆసక్తి ఉన్న వారికి తెలంగాణ స్టేట్ ఓపెన్ స్కూల్ సొసైటీ సదవకాశం కల్పిస్తోంది. ఓపెన్ స్కూల్ పదో తరగతి, ఇంటర్‌లోనూ ప్రవేశాలు అందుబాటులోకి వచ్చాయి. డిగ్రీ, పీజీలు కూడా చేయొచ్చు. ఏటా వేలాది మంది ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రవేశాలు తీసుకుంటూ చదువుపై దృష్టి పెడుతున్నారు. అయితే దీన్ని సద్వినియోగం చేసుకుని ప్రభుత్వ కొలువులు సాధిస్తున్న నేపథ్యంలో కథనం.

దరఖాస్తు ఇలా..


ఓపెన్ పది, ఇంటర్‌లో ఈ విద్యా సంవత్సరం 2024-25లో ప్రవేశాలు పొందడానికి అపరాధ రుసుముతో ఈ నెల 30వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు.

డిగ్రీ, పీజీకి అవకాశం

ఓపెన్ పది, ఇంటర్ పూర్తి చేసిన అభ్యాసకులు దూరవిద్యావిధానం ద్వారా డిగ్రీ ఆ తరువాత పీజీ చదువొచ్చు. ఓపెన్ ఇంటర్ పూర్తి చేసిన వారు రెగ్యులర్‌గా లేదంటే దూరవిద్యావిధానం ద్వారా డిగ్రీ చదవాలి. డిగ్రీ పూర్తి చేసిన వారు దూరవిద్యావిధానం ద్వారా లేదంటే రెగ్యులర్‌గా పీజీ చదువుకోవచ్చు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వాసులకు కాకతీయ, అంబేడ్కర్ విశ్వవిద్యాలయాలు దూరవిద్యావిధానం ద్వారా పీజీ చేసే అవకాశం కల్పించాయి.



ఓపెన్ స్కూల్‌కు హాజరైన అభ్యాసకులకు బోధిస్తున్న అధ్యాపకుడు



లక్షెట్టిపేట మండలం వెంకట్రావ్‌పేట గ్రామానికి చెందిన చెలిమెల రాజు స్కూల్ అసిస్టెంట్(తెలుగు)గా జిల్లాలో రెండో స్థానం, భాషా(తెలుగు) పండితుడిగా మూడో స్థానంలో ర్యాంకు సాధించారు. కుటుంబ ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా పదో తరగతి వరకు చదువుకొని మానేశాడు. అనంతరం స్వయం ఉపాధి పొందారు. 2008-2011లో దూర విద్యలో డిగ్రీ చదివారు. అనంతరం బీఈడీ, పీజీ పూర్తి చేశారు. గురుకుల పీజీటీ తెలుగు ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. డీఎస్సీకి సిద్ధమై మరో ఉద్యోగం సాధించారు. ఆర్థిక పరిస్థితులతో చదువు మధ్యలో మానేసినా నిరాశ చెందకుండా దూరవిద్యావిధానంతో తన లక్ష్యాన్ని సాధించి పలువురికీ ఆదర్శంగా నిలిచారు.

- చెన్నూరు ఓపెన్ పది, ఇంటర్ కేంద్రాల్లో చదువులు పూర్తి చేసిన ఎంతో మంది రెవెన్యూ, ఇతర శాఖల్లో ఉద్యోగాలు సాధించారు.
- ఓపెన్ ఇంటర్ పూర్తి చేసిన కాసిపేట మండలానికి చెందిన ఓ అభ్యాసకుడు 2018లో నీట్‌కు అర్హత సాధించాడు.

రెగ్యులర్ విద్యతో సమాన గుర్తింపు

- అశోక్, ఓపెన్ స్కూల్ సొసైటీ ఉమ్మడి జిల్లా సమన్వయకర్త

ఓపెన్ స్కూల్ విద్యకు రెగ్యులర్‌తో సమాన గుర్తింపు ఉంది. పది పూర్తిచేసిన వారు ఆపై విద్యకు, ఇంటర్ పూర్తి చేసిన వారూ ఉన్నత విద్యకు అర్హులే. ప్రభుత్వ రంగంలో చిరు ఉద్యోగాలు చేసుకునే వారికి పదోన్నతులకు అవకాశం ఉంటుంది. ఓపెన్ ఇంటర్ చదివిన వారికి గత ప్రభుత్వంలో పదోన్నతులు, ఉద్యోగాలు కూడా సాధించారు.

సీతాఫలం @ పీచర



చెట్టుపై

లక్ష్మణచాంద, న్యూస్‌టుడే: కాలనుగుణంగా, ప్రకృతి పరంగా లభించే ఫలాల్లో సీతాఫలాన్ని అందరూ ఇష్టపడుతారు. మధురమైన సీతాఫలాలకు లక్ష్మణచాంద మండలం పీచర గ్రామం ప్రసిద్ధి. ఈ గ్రామంలో సీతాఫలం చెట్టులేని తోట ఉండదంటే అతిశయోక్తి కాదు. పీచరలోకి ప్రవేశించే మార్గంలో రహదారికి ఇరువైపులా సీతాఫలం చెట్లు స్వాగతం పలుకుతాయి. తమ పరిధిలోని తోటల్లో, రహదారుల వెంట ఏ ఒక్క రైతు వీటిని నాటలేదు. ప్రకృతి పరంగా మొలిచిన చెట్లను రక్షిస్తుండటంతో ఏపుగా పెరిగి రైతులకు శీతాకాలంలో అదనపు ఆదాయాన్ని ఇస్తున్నాయి. వర్షాకాలం ముగింపు.. సీతాకాలం ప్రారంభంలో స్థానిక రైతులు ఈ చెట్లకు కాపలాగా ఉంటారు. నిత్యం నిర్మల్‌కు తీసుకెళ్లటంతో పాటు, స్థానికంగా విక్రయిస్తుంటారు. నిర్మల్‌లోని ప్రధాన రహదారుల వెంట, మార్కెట్ ప్రాంతంలో గ్రామ మహిళలు విక్రయిస్తుంటారు. చెట్లపై పండిన పండ్లను నేరుగా మార్కెట్‌కు తీసుకెళ్తుండటంతో ఇక్కడి ఫలానికి అధిక డిమాండ్ ఉంటుంది. ఒక్కో ఫలానికి సైజును బట్టి రూ.15 నుంచి రూ.70 వరకు ధర పలుకుతోంది. గ్రామంలోని దాదాపు పదిహేను కుటుంబాలు పండ్లు వచ్చినన్ని రోజులు విక్రయాలు జరుపుతుంటాయి. తన తోటలోని చెట్ల ద్వారా సుమారు రూ.50 వేల ఆదాయం సమకూరుతుందని స్థానిక రైతు తెలిపారు.



పీచర వెళ్లే మార్గంలో రహదారికి ఇరువైపులా సీతాఫలం చెట్లు



పోటీలను ప్రారంభిస్తున్న అతిథులు, క్రీడా సంఘాల సభ్యులు, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి

అట్టహాసంగా తైక్వాండో జోనల్ స్థాయి పోటీలు

మంచిర్యాల క్రీడావిభాగం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలో పాఠశాల క్రీడా సమాఖ్య ఏర్పాటు చేసిన జోనల్ స్థాయి (ఉమ్మడి జిల్లా) తైక్వాండో పోటీలు సోమవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. అండర్-14, 17 బాలబాలికల విభాగాల్లో స్థానిక సెవెన్‌హిల్స్ పాఠశాలలో పోటీలు నిర్వహించారు. ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి ఫణిరాజా, పాఠశాల కరస్పాండెంట్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని మెరుగైన ఆటతీరుతో ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఇక్కడ రాణించిన వారిని త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు ఫణిరాజా తెలిపారు. తైక్వాండో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి వెంకటస్వామి, శిక్షకుడు మంద శ్రీనివాస్, సీనియర్ క్రీడాకారులు రోహిత్, రాహుల్, శ్రావణ్, శ్రీజ, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక ప్రాంతాలు చూసేద్దాం..

తెలంగాణ దర్శినికి ప్రభుత్వం శ్రీకారం

న్యూస్‌టుడే, కాగజ్‌నగర్ : కొత్త ప్రాంతాల్లో పర్యటించాలన్న ఆసక్తి ఉన్న విద్యార్థులను ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ప్రభుత్వ పాఠశాల, కళాశాల విద్యార్థులకు పర్యాటక, చారిత్రక ప్రాంతాలపై అవగాహన కల్పించేందుకు 'తెలంగాణ దర్శిని'కి శ్రీకారం చుట్టింది. రెండో తరగతి నుంచి డిగ్రీ విద్యార్థుల వరకు వివిధ పర్యాటక ప్రదేశాలను సందర్శించేందుకు అవకాశం కల్పిస్తోంది. ఖర్చును ప్రభుత్వమే భరిస్తుంది. సెలవుల తర్వాత.. ఎకో టూరిజం, ఆర్ట్, క్రాఫ్ట్, వారసత్వం, సాంస్కృతిక, చారిత్రక, శాస్త్రీయ ప్రాముఖ్యత ఉన్న ప్రదేశాలను సందర్శించేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని సెప్టెంబరు 29న జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో దసరా సెలవుల తర్వాత అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ప్రభుత్వ నిర్ణయం మేరకు ఇప్పటికే కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులు పర్యాటక ప్రాంతాల సందర్శన మొదలైంది. ఇటీవల కళాశాలలో టూరిజం క్లబ్ ఏర్పాటు చేసి స్థానిక త్రిశూల్ పహాడ్‌పై ఉన్న ఆలయ సముదాయాలను సందర్శించారు. త్రిశూల్ పహాడ్‌ను పర్యాటక ప్రదేశంగా మార్చడానికి ఏర్పాటు చేయాల్సిన వసతులపై విద్యార్థులు నమోదు చేసుకున్నారు.



కోసిని రిజర్వాయర్ వద్ద విద్యార్థులకు జాతీయ విపత్తుల రక్షణ దళం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం



త్రిశూల్‌పహాడ్‌పై పర్యటనలో కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు

తరగతుల వారీగా వివరాలు

విభాగం	తరగతులు	రోజులు	దూరం	ఒక్కో విద్యార్థికి ఖర్చు(రూ.లలో)
1	2-4	ఒక రోజు	స్థానికం (మండల పరిధి)	300
2	5-8	ఒక రోజు	20-30	800
3	9-ఇంటర్	రెండు రోజులు	50-70	2000
4	డిగ్రీ	నాలుగు రోజులు	రాష్ట్రంలో ఎక్కడైనా	4000

సంప్రదాయాలు తెలుసుకునే అవకాశం



తెలంగాణ దర్శిని కార్యక్రమం విద్యార్థులకు తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలు తెలుసుకునే అవకాశం కల్పిస్తుంది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో చారిత్రక ప్రదేశాలు, ఇతర పర్యాటక ప్రదేశాలపై ప్రత్యేక అవగాహన ఏర్పడుతుంది. వారసత్వ సంపదను కాపాడుకోవడంలో భాగస్వాములు అయ్యే అవకాశం ఉంది.
- వాసాల ప్రభాకర్, మండల విద్యాధికారి, కాగజ్‌నగర్

పర్యాటక రంగ అభివృద్ధికి దోహదం



విద్యార్థుల్లో పర్యాటక రంగంపై అవగాహన కల్పించేందుకు తెలంగాణ దర్శిని ఎంతగానో ఉపయోగపడనుంది. పర్యాటక రంగంలో వస్తున్న మార్పులు, ఉద్యోగ అవకాశాలను సైతం డిగ్రీ విద్యార్థులకు వివరించి పర్యాటక రంగంలో ఉపాధి పొందేలా ప్రణాళికలు తయారు చేస్తాం.
- లక్ష్మీనరసింహం, వైస్ ప్రిన్సిపల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కాగజ్‌నగర్

బాసరలో ప్రసాదాల కొరత

మూడు గంటల పాటు భక్తుల నిరీక్షణ

బాసర(ముథోల్), న్యూస్‌టుడే: అధికారుల పర్యవేక్షణ లోపం, సిబ్బంది నిర్లక్ష్యం ఫలితంగా సోమవారం బాసరలోని సరస్వతి ఆలయంలో ప్రసాదాల కొరత ఏర్పడింది. బాసర గోదావరి నదిలో దుర్గామాత విగ్రహాల నిమజ్జనోత్సవాల సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో సరస్వతి అమ్మవారి దర్శనానికి తరలివచ్చారు. దర్శనం అనంతరం భక్తులు ఉదయం 9.30 గంటలకు ప్రసాదాల టిక్కెట్ కొనుక్కుని కౌంటర్‌కు వెళితే నిల్వ లేవు. ప్రసాదం వస్తోందంటూ భక్తులను మూడు గంటల పాటు ఆపారు. విసుగు చెందిన కొందరు టికెట్ డబ్బులు వెనక్కి ఇవ్వాలని అధికారులను నిలదీశారు. అధికారుల నిర్లక్ష్యం వల్లనే ఇలా జరిగిందని మండిపడ్డారు. తరచూ ఇలాగే జరుగుతున్నా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.. తీరా మధ్యాహ్నం రెండు గంటలకు చిన్న లడ్డూలను కౌంటర్‌కు తీసుకువచ్చారు. అప్పటికే పలువురు భక్తులు ప్రసాదాలు తీసుకోకుండానే వెనుతిరిగారు. ఆదివారం దసరా ఉండటంతో సోమవారం భక్తులు తక్కువగా వస్తారనే అంచనాతో ప్రసాదాల తయారీని నిలిపివేశారు. ఒక్కసారిగా భక్తులు తరలిరావడంతో కొరత ఏర్పడింది. గత సంవత్సరం ఇదే సందర్భంలో సిద్ధం చేసిన ప్రసాదాలు విక్రయం కాక గ్రామం చివరన కాల్చివేశారు. ఆలయానికి రెగ్యులర్ ఈఓ లేకపోవడం, సిబ్బంది కొరతతో పాలనాపరంగా ఇబ్బందులు తలెత్తుతున్నాయని స్థానికులు అంటున్నారు. సమస్యపై 'న్యూస్‌టుడే' ఆలయ ఇన్‌ఛార్జి ఈఓ విజయరామారావును చరవాణిలో సంప్రదించగా భక్తుల సంఖ్య ఊహించిన దానికి భిన్నంగా ఉండి సమస్య తలెత్తిందని, పునరావృతం కాకుండా చూస్తామని చెప్పారు.

స్టేషన్‌లో పోలీసు సిబ్బంది మధ్య గొడవ

సిరికొండ, న్యూస్‌టుడే : ఆదిలాబాద్ జిల్లాలోని సిరికొండ పోలీస్ స్టేషన్‌లో ఇద్దరు సిబ్బంది మధ్య జరిగిన గొడవ స్థానికంగా విమర్శలకు తావిస్తుంది. ఆదివారం రాత్రి ఇద్దరు సిబ్బంది మద్యం మత్తులో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. చుట్టుపక్కల వారు గమనించడంతో వారి తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ ఘటనపై సోమవారం సీఐ భీమేష్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి విచారణ చేపట్టారు. ఈ విషయమై 'న్యూస్‌టుడే' సీఐని వివరణ కోరగా ఈ విషయం తమ దృష్టికి వచ్చిందని, విచారణ జరిపి ఉన్నతాధికారులకు నివేదిస్తానని తెలిపారు.

ఉద్యోగుల బరి.. లక్ష్యంపై గురి

రాష్ట్ర, జాతీయస్థాయి హాకీ పోటీల్లో రాణింపు

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ క్రీడావిభాగం:

వీరంతా మూడు పదుల వయసు దాటినవారు. చిన్నప్పుడు ఇష్టంతో ఎంచుకున్న హాకీ ఆటలో మెరుపులు మెరిపించారు. ఇప్పటికీ రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరుస్తున్నారు. ఉన్నతంగా చదువుకుని ప్రభుత్వ కొలువులు సాధించారు. తాజాగా హైదరాబాద్‌లోని సికింద్రాబాద్ రైల్వే నిలయం ఆస్ట్రో టర్ఫ్ మైదానంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి సీనియర్ హాకీ పోటీలకు ఎంపికయ్యారు.

నిత్యం సాధన



సీనియర్ నేషనల్స్ : 1
సీనియర్ రాష్ట్రస్థాయి : 6
యూనివర్సిటీ గేమ్స్ : 2
రాష్ట్రస్థాయి పోటీలు : 30

ఆదిలాబాద్‌లోని ఖానాపూర్ కాలనీకి చెందిన షేక్ మహమ్మద్ 2000 సంవత్సరంలో హాకీ ఆటకు ఆకర్షితులయ్యారు. నిత్యం ఇందిరా ప్రియదర్శిని క్రీడా మైదానంలో సీనియర్ల వద్ద మెలకువలు నేర్చుకున్నారు. రైట్ బ్యాక్ స్థానంలో ఆడుతూ ప్రత్యర్థులు కొట్టే బంతులను గోల్స్ కాకుండా అడ్డగించడంలో ప్రావీణ్యం పొందారు. 2013లో క్రీడా విభాగంలో ఆబ్కారీశాఖలో కానిస్టేబుల్ ఉద్యోగం సాధించి ఇచ్చోడలో విధులు నిర్వహిస్తున్నారు.

దేశానికి ఆడాలని..



నేరడిగొండ మండలం ఫటఫటితాండ గ్రామానికి చెందిన ఆడే అశోక్‌కుమార్. హాకీలో దేశానికి ఆడాలని లక్ష్యం పెట్టుకున్నారు. గోల్ కీపింగ్‌లో శిక్షణ తీసుకున్నారు. పలు రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచారు. 2012లో క్రీడా విభాగంలో పోలీసు ఉద్యోగం సాధించారు. ప్రస్తుతం ఆదిలాబాద్‌లో ఏఆర్ హెడ్ క్వార్టర్‌లో స్పెషల్ పార్టీలో విధులు నిర్వహిస్తున్నారు. జిల్లా, రాష్ట్ర జట్టుకు పలుమార్లు సారథిగా వ్యవహరించి జట్టును ఒంటిచేత్తో గెలిపించారు.

సీనియర్ నేషనల్స్ : 4
జూనియర్ నేషనల్స్ : 4
ఆలిండియా పోలీసు క్రీడలు : 10
బెంగుళూరు, పూణే, ఖరగ్‌పూర్ లీగ్ పోటీలు : 3
రాష్ట్రస్థాయి పోటీలు : 51

నిరంతర విద్యార్థి



ఆదిలాబాద్‌లోని కుమ్మరివాడకు చెందిన యెగిడి శేఖర్ 2006 నుంచి సీనియర్లతో కలిసి హాకీ ఆడుతున్నారు. బెంగుళూరులో ఏడాదిపాటు ఎన్ఐఎస్ హాకీ డిప్లొమా కోర్సు పూర్తి చేశారు. 2019లో ఉట్నూరు గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాలలో హాకీ శిక్షకుడిగా ఉద్యోగం సాధించారు. విద్యార్థులను శిక్షణనిస్తూ, సీనియర్స్ విభాగంలో స్వయంగా పోటీల్లో పాల్గొంటున్నారు.

సీనియర్ నేషనల్స్ : 2
కేయూ, ఓయూ గేమ్స్ : 4
పైకా : 1
రాష్ట్రస్థాయి పోటీలు : 34

మైదానమే నేస్తం



సీనియర్ నేషనల్స్ : 5
యూనివర్సిటీ గేమ్స్ : 5
రాష్ట్రస్థాయి : 21
పంచాయత్ యువ క్రీడా ఔర్ ఖేల్ అభియాన్(పైకా) : 1

ఆదిలాబాద్ శాంతినగర్ కాలనీకి చెందిన పెద్దివార్ శ్రీనివాస్ 2004 నుంచి హాకీ ఆడుతున్నారు. సీనియర్ క్రీడాకారుల వద్ద శిక్షణ పొందారు. సమయం దొరికితే మైదానంలో సాధన చేస్తుంటారు. సెంటర్ ఫార్వర్డ్‌లో చురుకుగా కదులుతూ గోల్స్ చేయడంలో దిట్ట. జిల్లా, రాష్ట్ర జట్టుకు సారథిగా వ్యవహరించి పలుమార్లు జట్టును విజయపథంలో నడిపించారు. ఇందిరా ప్రియదర్శిని క్రీడా ప్రాంగణంలోని ఖేలో ఇండియా హాకీ కేంద్రంలో రెండేళ్లుగా కోచ్‌గా పని చేస్తున్నారు.

ఆటే శ్వాసగా



సీనియర్ నేషనల్స్ : 1
జూనియర్ నేషనల్స్: 1
యూనివర్సిటీ గేమ్స్ : 4
అండర్-19 ఎస్‌జీఎఫ్ నేషనల్ : 1
రాష్ట్రస్థాయి పోటీలు : 22

ఆదిలాబాద్‌లోని శ్రీరాంనగర్ కాలనీకి చెందిన ఆత్రం అతుల్ 2003లో హాకీపై మక్కువ పెంచుకుని సీనియర్ క్రీడాకారులతో కలిసి సాధన చేశారు. లెఫ్ట్ బ్యాక్‌లో ఆడుతూ ప్రత్యర్థి జట్టు గోల్స్ చేయకుండా చాకచక్యంగా ఆపడంలో మెరిక. కాకతీయ విశ్వవిద్యాలయం జట్టుకు, అండర్-19 తెలంగాణ జట్టుకు సారథిగా వ్యవహరించారు. 2020 నుంచి నార్నూరులోని ఏకలవ్య ఆదర్శ క్రీడా పాఠశాలలో హాకీ కోచ్‌గా విధులు నిర్వహిస్తున్నారు.



హాకీ సాధన చేస్తున్న ఉద్యోగులు

మేమున్నాం.. మీకు తోడుగా..

మంచిర్యాల: 98663 07290
చెన్నూరు: 98496 20143
బెల్లంపల్లి: 99496 20369
(10 AM TO 1 PM)

చెన్నూరు, న్యూస్‌టుడే:

? చెన్నూరు పట్టణంలోని గాంధీచౌక్ నుంచి ఎస్‌బీఐ మీదుగా రావిచెట్టు వరకు వీధి దీపాలు వెలగడం లేదు. **- తరుణ్, స్థానికుడు**

✔ సమస్య మా దృష్టికి రాలేదు. వెంటనే వీధి దీపాలను ఏర్పాటు చేయిస్తాం. **- సాయికిరణ్, ఏఈ, చెన్నూరు మున్సిపాలిటీ**

? పట్టణంలోని లైన్‌గడ్డ ప్రాంతంలో మిషన్ భగీరథ పైపు లీకై నీరు కలుషితమవుతోంది. **- సుజన్, స్థానికుడు**

✔ ప్రాంతాన్ని సందర్శించి రెండు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తాం. **- విద్యాసాగర్, మిషన్ భగీరథ డీఈ**

మంచిర్యాల పట్టణం, న్యూస్‌టుడే:

? సున్నంబట్టివాడలో పందుల సంచారం ఎక్కువగా ఉంది. అవి ఇళ్లలోకి వచ్చి ఇబ్బంది కలిగిస్తున్నాయి. **- అనిత, సున్నంబట్టివాడ**

✔ పందుల వ్యాపారులకు నోటీసులు ఇచ్చి అక్కడ పందులు తిరగకుండా చర్యలు తీసుకుంటాం. **- ఉదయ్ కిరణ్, పారిశుద్ధ్య విభాగం అధికారి, మంచిర్యాల**

బెల్లంపల్లి పట్టణం, న్యూస్‌టుడే:

? పట్టణంలోని రవీంద్రనగర్‌లో వీధి దీపాలు మళ్లీ వెలగడం లేదు. మూడు రోజుల క్రితం విద్యుత్తు తీగలు ఏర్పాటు చేశారు. ఒక్కరోజు మాత్రమే వెలిగాయి. **- సతీష్, రవీంద్రనగర్**

✔ ఎందుకు వెలగడం లేదో రెండు రోజుల్లో చూసి సమస్యను పరిష్కరిస్తాం. **- సందీప్, మున్సిపాలిటీ ఏఈ**

? పట్టణంలోని బెల్లంపల్లి బస్తీ ప్రధాన రహదారి పక్కన మురుగుకాల్వలు అధ్వానంగా మారాయి. మురుగు నిలిచిపోవడంతో దుర్వాసన వస్తుంది. **- శ్రీనివాస్, బెల్లంపల్లిబస్తీ**

✔ మురుగుకాల్వలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయిస్తున్నాం. బెల్లంపల్లిబస్తీలో మురుగుకాల్వల్లో పూడిక తొలగించేలా చర్యలు చేపడతాం. **- వైకుంఠం, పారిశుద్ధ్య అధికారి**

భీమిని, న్యూస్‌టుడే:

? అక్కలపల్లి గ్రామ పంచాయతీలో డంపింగ్‌యార్డు, శ్మశాన వాటికకు వెళ్లడానికి రోడ్డు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. **- గ్రామస్థులు**

✔ డీఎంఎఫ్‌టీ నిధులు లేదా 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రోడ్డు నిర్మించేలా చర్యలు తీసుకుంటాం. **- గంగామోహన్, ఎంపీడీఓ, భీమిని**

మంచిర్యాల పట్టణం, న్యూస్‌టుడే:

? వడ్డెరకాలనీ నుంచి వికాస్‌నగర్ వెళ్లే దారిలో రహదారికి ఇరువైపుల ట్రాక్టర్లు నిలుపుతున్నారు. అక్కడ వాహనదారుల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. **- మహేందర్‌రెడ్డి, స్థానికుడు**

✔ క్షేత్ర స్థాయిలో పరిశీలించి ట్రాక్టర్లు నిలుపకుండా చర్యలు తీసుకుంటాం. **- మసూద్ అలీ, పురపాలిక ఇంజినీర్, మంచిర్యాల**

దరఖాస్తుల ఆహ్వానం

చెన్నూరు గ్రామీణం, న్యూస్‌టుడే : మండలంలోని కిష్టంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కామర్స్ సబ్జెక్టు బోధనకు అతిథి లెక్చరర్ పోస్టుకు అర్హులైన అభ్యర్థుల ఎంపిక కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ పట్వర్ధన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కామర్స్ సబ్జెక్టులో పీజీలో కనీసం 60 శాతం మార్కులు పొందిన వారికి అవకాశం ఉంటుందన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 16లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. 17న కళాశాల ప్రాంగణంలో ఇంటర్వ్యూ నిర్వహించి అభ్యర్థి ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

పాఠశాల భవన నిర్మాణ పనుల అడ్డగింత

భీమారం, న్యూస్‌టుడే : జైపూర్ మండలంలోని గంగిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించనున్న ప్రభుత్వ పాఠశాల భవన నిర్మాణ పనులను అదే గ్రామానికి చెందిన శీలం సుశీల, ముత్తక్కలు అడ్డుకున్నారు. పాత పాఠశాల భవనం శిథిలావస్థకు చేరడంతో నూతన భవనం కోసం ప్రభుత్వ రూ.50 లక్షలు మంజూరు చేసింది. ఈ క్రమంలో సోమవారం ప్రభుత్వ స్థలంలో పనులు ప్రారంభించేందుకు వచ్చిన వారిని ఈ స్థలం తమదేనని సదరు మహిళలు అడ్డుకున్నారు. గ్రామంలో అభివృద్ధి పనులు జరగకుండా ప్రభుత్వ స్థలాలు కబ్జాకు పాల్పడాలనే ఉద్దేశ్యంతో అడ్డుపడుతున్నారని వారిపై తగు చర్యలు తీసుకోవాలని రెవెన్యూ, పోలీసు శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు మాజీ సర్పంచి లింగారెడ్డి తెలిపారు.

యువత క్రీడాసక్తిని పెంపొందించుకోవాలి

చెన్నూరు గ్రామీణం, న్యూస్‌టుడే : యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి క్రీడా స్ఫూర్తిని అలవర్చుకోవాలని జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్ అన్నారు. చెన్నూరు మండలంలోని అంగ్రాజ్‌పల్లి గ్రామంలో జరుగుతున్న రత్న పోచిరెడ్డి స్మారక క్రికెట్ పోటీల ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. విజేతగా నిలిచిన అంగ్రాజ్‌పల్లి, ద్వితీయ స్థానంలో నిలిచిన కిష్టంపేట జట్లకు బహుమతి ప్రదానం చేశారు.

వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని వినతి

బెల్లంపల్లి పట్టణం : పట్టణంలో కొత్తగా నిర్మాణం చేపడుతున్న అంబేడ్కర్ భవన్ స్థలంలో ఇసుక, కంకర వ్యాపారం చేస్తున్న వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని దళిత సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఇసుక, కంకర పోయకుండా చూడాలని కోరారు. దళిత సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు రాజేష్, నాయకులు పాల్గొన్నారు.

గడువు పొడిగింపు

మందమర్రి పట్టణం : మందమర్రి ప్రభుత్వ ఐటీఐలో టాటా టెక్నాలజీస్ సహకారంతో ప్రారంభించనున్న నూతన కోర్సుల్లో చేరేందుకు గడువు పొడగించినట్లు ప్రిన్సిపల్ దేవానంద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకునే అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు.

ఆటోల బంద్ విజయవంతం

బెల్లంపల్లి పట్టణం : బెల్లంపల్లిలో ఆటోడ్రైవర్లపై దాడిని నిరసిస్తూ సోమవారం ఆటో యూనియన్ ఆధ్వర్యంలో బంద్ నిర్వహించారు. ఆటోడ్రైవర్లు కట్ట రాంకుమార్, కంపెల లక్ష్మణ్‌లపై ఆరుగురు వ్యక్తులు దాడి చేశారని యూనియన్ నాయకులు పేర్కొన్నారు. వీరి దాడి నుంచి తప్పించుకుని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు.

విద్యుత్తు నియంత్రికల ఏర్పాటు

చెన్నూరు గ్రామీణం : కొమ్మెర సబ్‌స్టేషన్ పరిధిలో వ్యవసాయ బోర్లకు విద్యుత్తు నియంత్రికలు పనిచేయక సాగునీటికి రైతులు పడుతున్న ఇబ్బందులను విద్యుత్తుశాఖ ఏఈ భాస్కర్ దృష్టికి తీసుకెళ్లారు. బీరెల్లి, ముత్తరావుపల్లి గ్రామాల పరిధిలో మరమ్మతులు అవసరం ఉన్న విద్యుత్తు నియంత్రికలు సరిచేయడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అస్నాద్ గ్రామంలో వైద్య శిబిరం

చెన్నూరు గ్రామీణం : చెన్నూరు మండలంలోని అస్నాద్‌లో సోమవారం అంగ్రాజ్‌పల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలోని 152 మందికి వైద్య పరీక్షలు చేయగా.. ఎనిమిది మందికి జ్వరాలు ఉన్నట్లు నిర్ధారణ కావడంతో వారి రక్తనమూనాలను సేకరించి మందులను పంపిణీ చేశారు. వైద్యాధికారి కృష్ణతేజ, హెచ్‌ఈవో జగదీశ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



ముల్కల్లలో మంగళహారతులతో శోభాయాత్రలో పాల్గొన్న మహిళలు

ఘనంగా దుర్గామాత నిమజ్జనోత్సవం

హాజీపూర్, న్యూస్‌టుడే : దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని మండలంలోని ముల్కల్ల గ్రామంలో ఏర్పాటుచేసిన దుర్గామాత విగ్రహాన్ని సోమవారం అత్యంత భక్తి శ్రద్ధలతో శోభాయాత్ర నిర్వహించి అనంతరం గోదావరిలో నిమజ్జనం చేశారు. మహిళలు పూజల అనంతరం మంగళహారతులతో అమ్మవారి శోభాయాత్రలో పాల్గొన్నారు.

సమీకృతం..

రూ.175 కోట్లతో భవన నిర్మాణానికి శంకుస్థాపన

పేద విద్యార్థులకు వరం

న్యూస్‌టుడే, దండేపల్లి గ్రామీణం: విద్యారంగంలో మార్పులకు కాంగ్రెస్ ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది. రాష్ట్రంలోని 28 నియోజకవర్గాల్లో సమీకృత గురుకులాలకు పునాదులు వేసింది. వీటిలో కులమతాలకు అతీతంగా అంతర్జాతీయ స్థాయిలో పేద విద్యార్థులకు విద్య అందనుంది. అంతర్జాతీయ వసతితో పాటు ఇతర సౌకర్యాలు కల్పించనున్నారు. జిల్లాలో మంచిర్యాల నియోజకవర్గంలో దండేపల్లి మండలం రెబ్బెన్‌పల్లి, చెన్నూరు నియోజకవర్గంలో సోమనపల్లిలో భవన నిర్మాణాలకు శంకుస్థాపనలు చేసి పనులు ప్రారంభించారు. వీలైనంత త్వరలో నిర్మాణాలు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని ఎమ్మెల్యే గుత్తేదారులను ఆదేశించారు.

అయిదు నుంచి ఇంటర్ వరకు..

సమీకృత గురుకులంలో అన్ని వర్గాలకు ఒకే చోట ప్రవేశాలు కల్పిస్తారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఓసీ ప్రతి ఒక్కరు అయిదో తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుకోవచ్చు. అయితే వీటిలో ప్రవేశాలు పోటీ పరీక్ష ద్వారానా.. అనే లేక దరఖాస్తు చేసుకుంటే కల్పిస్తారా.. అనే దానిపై స్పష్టత ఇంకా రాలేదని అధికారులు చెబుతున్నారు. ఇవి అందుబాటులోకి వస్తే విద్యార్థులకు వసతి కష్టాలు దూరమవుతాయి. ఒక్కో గురుకులంలో 2 వేలకు పైగా విద్యార్థులకు అవకాశం దక్కుతుంది.

మెరుగైన సదుపాయాలు

విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఒకే చోట వసతి సదుపాయం ఉంటుంది. క్రీడా మైదానం, సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన కోసం ప్రత్యేక స్థలం, గురుకులంలో ఒక వైద్యుడితో పాటు నర్సులు ఎల్లప్పుడు సేవలు అందిస్తారు. ప్రత్యేక గ్రంథాలయం, డిజిటల్ బోర్డులుంటాయి. విద్యార్థులంతా కూర్చొని భోజనం చేయడానికి డైనింగ్ హాల్, పెద్ద గదిలో పది వరకు మంచాలు, రెండు అటాచ్ మరుగుదొడ్లు, మూత్రశాలలతో నిర్మాణం చేపడుతున్నారు.



రెబ్బెన్‌పల్లిలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు (పాతచిత్రం)

విద్యారంగానికి పెద్దపీట

దండేపల్లి మండలం రెబ్బెన్‌పల్లిలో సమీకృత గురుకుల నిర్మాణానికి శంకుస్థాపన జరిగింది. మొత్తం 22 ఎకరాలలో భవన నిర్మాణం చేపడుతున్నాం. వీలైనంత త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు చెప్పడం జరిగింది. ప్రభుత్వం విద్యారంగానికి పెద్దపీట వేస్తోంది. నియోజకవర్గానికి మరిన్ని నిధులు, పరిశ్రమలు తీసుకొచ్చి అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు కృషి చేస్తాం.
- కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు, ఎమ్మెల్యే, మంచిర్యాల

చేపల వేట కోసం కొంగల ఆట



ఈ చిత్రాన్ని చూస్తే తెలుస్తుం, నలుపు కొంగలు సరదాగా ఆడుతున్నట్లుగా కనిపిస్తోంది కదూ... నిజానికి అవి పొట్ట నింపుకోవడానికి చేపల వేట కోసం ఇదిగో ఇలా నీటి కుంట మీద ఎగురుతూ తిరిగి నీటిలో వాలి పోయి చేపలను తింటున్నాయి. చూపరులను ఆకట్టుకుంటున్న ఈ కొంగల వే(ఆ)ట జన్నారం మండలం తపాలపూర్ గోదావరి సమీపంలోని నీటి కుంట వద్ద సోమవారం 'న్యూస్‌టుడే' కెమెరాకు చిక్కింది. **- న్యూస్‌టుడే, జన్నారం**

ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తల ర్యాలీ

బెల్లంపల్లి పట్టణం: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ స్థాపించి వందేళ్లలో అడుగు పెట్టిన సందర్భంగా సోమవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కాంటాచౌరస్తా నుంచి శిశుమందిర్ పాఠశాల వరకు ప్రదర్శన చేపట్టారు.

బకాయిలు విడుదలయ్యే వరకు కళాశాలల బంద్

మంచిర్యాల విద్యావిభాగం, న్యూస్‌టుడే : ప్రభుత్వం మూడు సంవత్సరాల నుంచి డిగ్రీ కళాశాలల ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడాన్ని నిరసిస్తూ జిల్లాలోని డిగ్రీ, పీజీ కళాశాలలు నిరవధిక సమ్మెకు దిగాయి. సోమవారం ఆయా కళాశాలల యాజమాన్యాలు బంద్ చేపడుతూ కళాశాలలను మూసివేశాయి. స్థానిక వివేకవర్థిని డిగ్రీ కళాశాలలో పలు కళాశాలల యాజమాన్యాలు అధ్యాపకులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఫీజు బకాయిలపై పలుమార్లు అధికారులను, మంత్రులను కలిసినా స్పందించలేదన్నారు. బకాయిలు విడుదల కాకపోవడంతో కళాశాలల నిర్వహణ కష్టతరమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రావాల్సిన బకాయిలు చెల్లించే వరకు పూర్తిస్థాయిలో కళాశాలల బంద్ చేపడుతున్నట్లు తెలిపారు. డిగ్రీ కళాశాలల నిర్వాహకులు శ్రీనివాస్, నర్సయ్య, మల్లయ్య, శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఆయా కళాశాలల నిర్వాహకులు

ఏసీసీ: విద్యార్థులు, కళాశాల నిర్వాహకులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు దృష్ట్యా ప్రభుత్వం వెంటనే చెల్లించాల్సిన ఫీజు బకాయిలను తక్షణమే విడుదల చేయాలని తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక రాష్ట్ర కార్యదర్శి చిప్పకుర్తి శ్రీనివాస్, భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మూడేళ్లుగా నిధులు విడుదల కాకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు.

ఆచార్య సాయిబాబా మృతి తీరని లోటు

మంచిర్యాల పట్టణం, బెల్లంపల్లి పట్టణం, న్యూస్‌టుడే : దిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్, మావన హక్కుల నేత ఆచార్య సాయిబాబా మృతి పేద, బలహీన వర్గాల ప్రజలకు తీరని లోటు అని సీపీఐ (ఎం.ఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి లాల్‌కుమార్ అన్నారు. మంచిర్యాలలో సోమవారం ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నాయకులు మంగ, అరుణ, మల్లన్న, తిరుపతి, నరేందర్, సారయ్య, సమ్మయ్య, అనిత, మంగ, లక్ష్మి పాల్గొన్నారు. జీఎన్ సాయిబాబా మృతికి కేంద్ర ప్రభుత్వమే కారణమని తెలంగాణ ప్రజా ఫ్రంట్ జిల్లా కన్వీనర్ జైపాల్‌సింగ్ అన్నారు. బెల్లంపల్లి పట్టణంలో ఆయన చిత్రపటం వద్ద వారు నివాళులర్పించారు.



మంచిర్యాలలో సాయిబాబా చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు

డిస్పెన్సరీల్లో మెరుగైన వైద్య సేవలు

శ్రీరాంపూర్ గ్రామీణం, న్యూస్‌టుడే : శ్రీరాంపూర్ ఏరియాలోని రవీంద్రఖని-8, నస్పూర్ డిస్పెన్సరీల్లో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు జీఎం బి. సంజీవరెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆర్కే-8 డిస్పెన్సరీలో కొత్తగా ఏర్పాటు చేసిన వాహనాల షెడ్డును ప్రారంభించారు. ఎస్ఓటూ జీఎం సత్యనారాయణ, గుర్తింపు సంఘం ఏరియా కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా, మురళీధర్, అరవిందరావు, డీవైసీఎంఓ డాక్టర్ రమేష్‌బాబు, వైద్యులు మురళీధర్, వేదవ్యాస్, లోక్‌నాథ్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకతపై సమీక్ష

శ్రీరాంపూర్ గ్రామీణం : శ్రీరాంపూర్ ఏరియాలో



కార్పొరేట్ జీఎం మనోహర్‌ను సన్మానిస్తున్న ఏరియా జీఎం బి.సంజీవరెడ్డి

బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకతపై కార్పొరేట్ జీఎం(ప్రాజెక్టు, ప్రణాళికలు) మనోహర్ సంబంధిత అధికారులతో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఏరియా జీఎం బి.సంజీవరెడ్డితో కలసి ఆయన మాట్లాడుతూ.. నిర్దేశిత లక్ష్య సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. ఓబీ వెలికితీతకు అడ్డంకులు లేకుండా చూడాలని పేర్కొన్నారు. ముందస్తు ప్రణాళికల ప్రకారం రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలని తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారిగా ఏరియాకు విచ్చేసిన మనోహర్‌ను ఏరియా జీఎం బి.సంజీవరెడ్డి ఘనంగా సన్మానించారు. ప్రాజెక్టు అధికారులు టి.శ్రీనివాస్, ఏవీ రెడ్డి, ఏజెంట్లు గోపాల్‌సింగ్, రాముడు, శ్రీధర్, డీజీఎం(పీ) అరవిందరావు, శ్రీధర్‌రావు, చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

యువతకు ఉపాధి లభించేలా కృషి


మందమర్రి పట్టణం, న్యూస్‌టుడే : సింగరేణి ప్రాంతంలోని నిరుద్యోగులకు ఉపాధి లభించేలా కృషి చేసేందుకు శిక్షణ ఇప్పిస్తున్నట్లు మందమర్రి జీఎం దేవేందర్ అన్నారు. సోమవారం మందమర్రి స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రంలో డీటీపీ కోర్సుపై శిక్షణ తరగతులను ప్రారంభించారు. సంస్థ సామాజిక బాధ్యతగా వృత్తి నైపుణ్య కోర్సుల్లో శిక్షణ ఇప్పిస్తున్నట్లు పేర్కొన్నారు. యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఎస్ఓటూ జీఎం రాజేశ్వర్‌రెడ్డి, సత్యనారాయణ, వెంకటరమణ, శంకర్, అశోక్, బెంజిమెన్ తదితరులు పాల్గొన్నారు.

ఖాదీ మేళా ప్రారంభం

శ్రీరాంపూర్ గ్రామీణం : నస్పూర్ కాలనీలోని మనోరంజన్ సముదాయంలో వావిలాల ఖాదీ గ్రామోద్యోగ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఖాదీ మేళాను ఏరియా జీఎం బ.సంజీవరెడ్డి-రాధాకుమారి దంపతులు సోమవారం ప్రారంభించారు. గుర్తింపు సంఘం ఏరియా కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా, డీజీఎం(పీ) అరవిందరావు, పీఓ కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

సెక్యూరిటీ అధికారులకు సన్మానం

శ్రీరాంపూర్ గ్రామీణం : శ్రీరాంపూర్ ఏరియా సెక్యూరిటీ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన జక్కారెడ్డి, ఇక్కడి నుంచి బదిలీపై వెళ్తున్న అధికారి మురళీమోహన్‌ను భద్రత సిబ్బంది ఘనంగా సన్మానించారు. సోమవారం సెక్యూరిటీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అధికారులు మాట్లాడుతూ సంస్థ ఆస్తులను రక్షించడంలో సిబ్బంది ముఖ్య పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. గుర్తింపు సంఘం ఏరియా కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా, ఇన్‌స్పెక్టర్లు స్వామి, రామిరెడ్డి, రాజయ్య, జమ్మేదార్‌లు కనకయ్య, రాంచందర్, మల్లేష్, కల్యాణ్, పిట్ కార్యదర్శి మల్లికార్జున్ పాల్గొన్నారు.



అధికారులను సన్మానిస్తున్న భద్రత సిబ్బంది

నిధుల దుర్వినియోగంపై విచారణ చేపట్టాలి

మంచిర్యాల విద్యావిభాగం, న్యూస్‌టుడే : కోటపల్లి మండలం దేవులవాడ జడ్పీహెచ్ఎస్‌లో 2023-24 సంవత్సరానికి సంబంధించి పీఎంశ్రీ నిధుల దుర్వినియోగంపై విచారణ చేపట్టాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆసంపల్లి రమేష్, మోతె జయకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్‌లోని విద్యాశాఖ కార్యాలయం ఆవరణలో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో విద్యార్థుల క్షేత్ర స్థాయి పర్యటనకు నిధులు మంజూరుచేసినప్పటికీ పర్యటనకు మాత్రం వారిని తీసుకెళ్లలేదన్నారు. సంబంధిత నిధులను విత్‌డ్రా చేసి ఆడిట్ సైతం చేయించారన్నారు. దీంతో పాటు స్కూల్ గ్రాంట్ నిధుల్లో తప్పుడు బిల్లులు చూయించారని ఆరోపించారు. దీనిపై విద్యాశాఖ అధికారి విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈమేరకు డీఈవో యాదయ్యకు వినతిపత్రాన్ని అందజేశారు.

ఉన్నత శిఖరాలను అధిరోహించండి

జన్నారం, న్యూస్‌టుడే : వైద్య వృత్తిలో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని గౌడ సంఘం నాయకులు అన్నారు. జన్నారం మండలం పొనకల్ మేజర్ గ్రామపంచాయతీకి చెందిన వైష్ణవి ఎంబీబీఎస్ సీటు సాధించడం పట్ల కులసంఘం నాయకులు విద్యార్థినితో పాటు తల్లిదండ్రులు వాణి-సుభాష్‌ను సోమవారం సన్మానించారు. పొనకల్ పట్టణ గౌడ సంఘం అధ్యక్షుడు సతీష్‌గౌడ్, మండల అధ్యక్షుడు భాస్కర్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, నర్సగౌడ్ పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు అండగా నిలవాలి

దండేపల్లి, న్యూస్‌టుడే : సమాజ సేవలో భాగస్వాములవుతూ పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే నిరుద్యోగ యువతకు చేయూతనిస్తూ అండగా నిలవాలని మున్నూరుకాపు ఉద్యోగ, విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం మండల గౌరవ అధ్యక్షుడు అన్నం సత్యనారాయణ పేర్కొన్నారు.. సోమవారం ఇక్కడ జరిగిన సంఘ సమావేశంలో ఇటీవల పదోన్నతులు పొందిన ఉద్యోగులు మొరుపుటాల ప్రేంకుమార్, తిరుపతి, తోట భీమయ్య, బక్కశెట్టి వెంకటేశ్, నాసాని రవి, కుంచె గణేశ్‌ను సన్మానించారు. సంఘ మండల అధ్యక్ష, కార్యదర్శులు రాజన్న, శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు మనోహర్, జిల్లా కన్వీనర్ బుచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

సత్తాచాటుతున్న ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్టు

మంచిర్యాల క్రీడావిభాగం, న్యూస్‌టుడే : రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్టు సత్తాచాటుతోంది. అండర్-14 విభాగంలో జరుగుతుండగా జోగులాంబ గద్వాల్ జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఏర్పాటు చేస్తోంది. ఉమ్మడి పది జిల్లాలు పాల్గొనగా తొలి మ్యాచ్‌లోనే జిల్లా క్రీడాకారులు మెరుగైన ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. అత్యుత్తమ ఆటతీరుతో 50 పరుగులు చేసి జట్టు విజయంలో మంచిర్యాల జిల్లా కేంద్రానికి చెందిన పులిపాక వికాస్ కీలకపాత్ర పోషించాడు. కాగా ఉమ్మడి కరీంనగర్ జట్టుపై సునాయసంగా గెలుపొంది ముందుకు దూసుకెళ్లారు. 68 పరుగుల లక్ష్యాన్ని ఒకే వికెట్ కోల్పోయి ఛేదించారు.



తొలి మ్యాచ్ విజయం సాధించిన అనంతరం జట్టు బాధ్యులతో ఉమ్మడి జిల్లా క్రీడాకారులు

నిజాయతీ చాటుకున్న హోటల్ యజమాని

మంచిర్యాలనేరవిభాగం, న్యూస్‌టుడే : హాజీపూర్ మండలం టీకానపల్లికి చెందిన అనూష అనే మహిళ సోమవారం పనుల నిమిత్తం మంచిర్యాలకు వచ్చారు. ఓ హోటల్‌లో భోజనం చేసి తన పర్సును మరచి పోయింది. హోటల్ యజమాని దాసు పర్సును గమనించి వెంటనే బ్లూకోల్ట్ సిబ్బందికి సమాచారం అందించారు. పర్సులో ఉన్న సమాచారం మేరకు బాధితురాలిని గుర్తించి రూ. 10వేల నగదుతో ఉన్న బ్యాగును సీఐ బన్సీలాల్ చేతుల మీదుగా అప్పజెప్పారు.

నేర వార్తలు

వాహనం ఢీకొని యువకుడి దుర్మరణం



నందు

మంచిర్యాలనేరవిభాగం, న్యూస్‌టుడే : దుర్గామాత నవరాత్రి ఉత్సవాల శోభాయాత్రలో విషాదం చోటు చేసుకుంది. సీసీసీకి చెందిన గోమాస నందు (16) స్థానిక రెడ్డికాలనీలో జరుగుతున్న అమ్మవారి శోభాయాత్రకు వెళ్లాడు. సోమవారం ఉదయం 2 గంటల సమయంలో ట్రాక్టరు పక్కన ఉన్న నందును బొలెరో వాహనం వచ్చి బలంగా ఢీ కొట్టింది. తీవ్రగాయాలైన యువకుడిని మెరుగైన వైద్యం కోసం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందినట్లు ఎస్సై సనత్ తెలిపారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

లారీ ఢీకొని వృద్ధుడి మృతి

నస్పూర్, న్యూస్‌టుడే : లారీ ఢీకొని వృద్ధుడు మృతి చెందిన సంఘటన నస్పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై సుగుణాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. నస్పూర్ గేట్‌కు చెందిన మందపల్లి మునీందర్(55) క్షౌరశాల నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. పని నిమిత్తం సోమవారం నస్పూర్ గేట్ నుంచి ఫ్లడ్‌కాలనీ వైపు ఓ పెట్రోల్ బంక్ వద్ద రహదారిపై నడుచుకుంటూ రోడ్డు దాటుతున్నాడు. ఈ క్రమంలో శ్రీరాంపూర్ నుంచి మంచిర్యాల వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టగా అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. మృతుడి భార్య హేమలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



మునీందర్

మురుగుకాల్వలో పడి ఒకరు..

మందమర్రి పట్టణం: మందమర్రి భాగ్యనగర్ కాలనీలో మురుగుకాల్వలో పడి మార్త కుమారస్వామి (53) మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఎస్సై రాజశేఖర్, కాలనీవాసుల కథనం మేరకు.. మేస్త్రీ పనిచేసుకునే కుమార్ దసరా పండగ కావడంతో అతిగా మద్యం తాగినట్లు భావిస్తున్నారు. రాత్రి సమయంలో ఇంటి ముందు గద్దెపై కూర్చుని పక్కనే ఉన్న మురుగుకాల్వలో పడిపోయి ఉంటారని అనుమానిస్తున్నారు. ఉదయం అటుగా వెళ్తున్న కాలనీవాసులకు అచేతన స్థితిలో ఉన్న కుమార్‌ను చూసి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సైతో పాటు సీఐ శశిధర్‌రెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. మృతుని భార్య, కూతురు, కుమారుడు స్థానికంగా లేకపోవడంతో ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

పురుగు మందు తాగి..

లక్షెట్టిపేట, న్యూస్‌టుడే : పట్టణంలోని బోయవాడకు చెందిన దూస మూడి చిన్న రాజయ్య (69) పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై సతీష్ కథనం మేరకు.. రాజయ్య కొంత కాలంగా హృద్రోగ సమస్యలతో బాధ పడుతున్నాడు. శస్త్ర చికిత్స అనంతరం మందులు వాడుతున్నప్పటికీ అనారోగ్య సమస్యలు వెంటాడుతున్నాయి. మరో వైపు భార్య కూడా అవగుణంలో పడటంతో ఆయన జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి కుమారుడు సత్యనారాయణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



రాజయ్య

కన్నెపల్లిలో యువకుడు..

కన్నెపల్లి: కన్నెపల్లి మండల కేంద్రంలోని వైన్స్ దుకాణం వద్ద భీమిని మండల కేంద్రానికి చెందిన జంగపల్లి రాకేష్ (35) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై గంగారాం కథనం మేరకు.. రాకేష్ కొంత కాలంగా మద్యానికి బానిసై తరచు భార్యతో గొడవ పడటంతో భార్య పుట్టింటికి కన్నెపల్లికి వచ్చింది. ఆదివారం తన భార్యను తీసుకుపోవడానికి వచ్చాడు. భార్య నిరాకరించడంతో రాత్రి సమయంలో వైన్స్ పక్కన పురుగు మందు తాగి స్పృహ కోల్పోయాడు. స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించే క్రమంలో మృతి చెందాడు. మృతుడి అన్నయ్య చంద్రయ్య ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.



రాకేష్

కులం పేరుతో దూషించారని ఫిర్యాదు

నెన్నెల, న్యూస్‌టుడే : మండలంలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన ఎల్పుల రాజం కులం పేరుతో దూషించి దాడి చేశారని పొన్నాల వెంటస్వామి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఎస్సై ప్రసాద్ కథనం మేరకు.. సోమవారం ఉదయం వెంకటస్వామి ఈత కల్లు తాగి తిరిగి ఇంటికి వస్తుండంగా మార్గ మధ్యలో వాంతులు చేసుకున్నాడు. ఆ స్థలం ఎల్పుల రాజంనకు చెందినది. తన చేనులో ఎందుకు వాంతులు చేసుకున్నావని కులం పేరుతో దూషించి కర్రతో దాడి చేశాడు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు ఎస్సై వివరించారు.

పాత పగలతో ఒకరికొకరు దూషణపై..

దండేపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: దండేపల్లి మండలం గూడెం గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు పాత పగలను దృష్టిలో పెట్టుకొని దసరా పండగ రోజున ఒకరికొకరు దూషించుకొని ఫిర్యాదు చేసుకున్నట్లు ఎస్సై ఉదయ్‌కిరణ్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. గూడెం సత్యనారాయణ స్వామి ఆలయం వద్ద ఆకిరెడ్డి వినోజ్‌ను అదే గ్రామానికి చెందిన బేర తిరుపతి, కానుగంటి చిరంజీవి వినోజ్‌ను అసభ్యకరంగా దూషించారు. అదే విధంగా బేర హరీష్‌ను ఆకిరెడ్డి వినోజ్, కళా అనిల్, సుద్దాల అరవింద్, జనగామా మల్లేశ్, తాండ్ర సాయిలే అసభ్యకరంగా దూషించారని పరస్పరం ఫిర్యాదు చేసుకున్నారు. చంపేస్తామంటూ బెదిరించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

అల్లరిమూకల దాడి

మంచిర్యాలనేరవిభాగం, న్యూస్‌టుడే : జిల్లా కేంద్రంలోని అశోక్‌రోడ్‌లో దుర్గాదేవి శోభాయాత్రలో కొంత మంది అల్లరిమూకలు ఓ కుటుంబంపై దాడికి పాల్పడ్డాయి. అర్ధరాత్రి డీజేతో వెళ్తున్న వాహనాన్ని ఇంటి ముందు నుంచి వెళ్లే క్రమంలో మోగించకుండా వెళ్లాలని చింతపండు శిరీష్ సదరు యువకులను కోరాడు. దీంతో వారు తమనే అడ్డుకుంటావా అంటూ పిడిగుద్దులతో కొట్టారు. అడ్డుకోబోయిన తల్లిదండ్రులతో పాటు స్నేహితులను చితకబాదారు. బాధితులు సోమవారం మంచిర్యాల పోలీస్‌స్టేషన్‌లో అబ్దుల్ అఫ్రోజ్, బిట్టులతో పాటు మరికొందరిపై ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ బన్సీలాల్ తెలిపారు.

భూ కబ్జాలకు పాల్పడుతున్న ఒకరి అరెస్టు

మంచిర్యాలనేరవిభాగం, న్యూస్‌టుడే : జిల్లా కేంద్రంలోని గర్మిళ్లశివారులో గల పోతిరెడ్డి సుధాకర్ రెడ్డికి చెందిన వెయ్యిగజాల స్థలాన్ని ఆక్రమించేందుకు యత్నించిన కుంట శ్రీనివాస్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు మంచిర్యాల ఏసీపీ ప్రకాష్ తెలిపారు. ఈ నెల 10న సుధాకర్‌రెడ్డితో పాటు అతడి పార్టనర్స్‌కు చెందిన స్థలంలోని సిమెంట్ ప్లేటులను శ్రీనివాస్ ధ్వంసం చేసినట్లు ఆయన పేర్కొన్నారు. నిందితుడి నుంచి ఒక తల్వార్ స్వాధీనం చేసుకున్నామన్నారు.

పలువురి బైండోవర్

జన్నారం, న్యూస్‌టుడే : కలమడుగు గ్రామ శివారులో ఉన్న పెట్రోల్ బంక్ వద్ద ఈ నెల 10న ఘర్షణ పడిన ఇరువర్గాల వారిని సోమవారం తహసీల్దార్ రాజ మనోహర్‌రెడ్డి ఎదుట బైండోవర్ చేసినట్లు జన్నారం ఎస్సై రాజవర్ధన్ తెలిపారు. రెంకల శ్రీనివాస్, గట్టు గణేశ్, సంగ అంజిక, సంగ తిరుపతి, ఆకుల బాలాజీ, కుడుకుల విజయ్, సాత్పడి రోహిత్, జి.హర్షవర్ధన్, జి. అరవింద్‌ను బైండోవర్ చేసినట్లుగా ఎస్సై చెప్పారు.